క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కాటారం: కాటారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్ పోస్టు తాత్కాలిక విధానంలో భర్తీ చేయుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకులం ఆర్సీఓ రాజ్యలక్ష్మీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాస్టర్ డిగ్రీ, బీ.ఎడ్ పూర్తి చేసి ఆయా సబ్జెక్టులలో 50 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలని సూచించారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఈ నెల 8న ఏటూరునాగారం గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో నిర్వహించనున్న డెమోకు హాజరుకావాలని పేర్కొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



భూపాలపల్లి రూరల్: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని ఎంపీపీ మందల లావణ్య రైతులకు తెలిపారు. శనివారం భూపాలపల్లి మండలంలోని గోర్లవీడు గ్రామంలో మండల పశువైద్యాధికారి తిరుపతి ఆధ్వర్యంలో టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



కాటారం: కాటారం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ నాగరాజు శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల పరిసరాలు, ఫర్నిచర్, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు, పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఉన్నాయా లేదా అని ఆరా తీశారు. వృద్ధులు, దివ్యాంగులైన ఓటర్లు వెళ్లేందుకు ర్యాంప్‌లు, తదితర అంశాలపై సిబ్బందితో చర్చించారు. పోలింగ్ కేంద్రాల్లో పూర్తి సౌకర్యాలు ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ వెంకన్న, వీఆర్ఏ జితేందర్ ఉన్నారు.

లైసెన్స్ తప్పనిసరి




చిట్యాల: వాహనం నడిపే ప్రతీ వాహనదారుడు లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని సెకండ్ ఎస్సై ఎండీ శాఖాన్ అన్నారు. శనివారం మండలంలోని చల్లగరిగ గ్రామ శివారులో వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపొద్దన్నారు. వాహన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



ఎస్ఎస్‌తాడ్వాయి: పదోతరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఏటూరునాగారం పీఎంఆర్సీ ఏపీసీఓ వాగ్య అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. పాఠశాలల్లోని విద్యార్థినుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తరగతి గదులను సందర్శించి సెలబస్ వివరాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల విద్యబోధనపై ఆరా తీశారు. విద్యార్థినులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకోవాలన్నారు. పాఠ్యాంశాలపై సందేహాలు ఉంటే ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకోవాలన్నారు. ఆయన వెంట పాఠశాల హెచ్ఎం పద్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



మహదేవపూర్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలోని పెద్దంపేట సమీపంలో శనివారం చోటు చేసుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబట్‌పల్లికి చెందిన లింగంపల్లి రాజు వ్యవసాయ పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై పలిమెల వెళ్తున్నాడు. ఈ క్రమంలో పెద్దంపేట సమీపంలో ఎదురుగా వస్తున్న టాటాఏస్ వాహనం ఢీ కొట్టడంతో రాజు తలకు గాయాలయ్యాయి. దీంతో వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం



చిట్యాల: గర్భిణులకు సీమంతం చేస్తున్న సీడీపీఓ



టేకుమట్ల: కిశోరామృతం పంపిణీ చేస్తున్న సరోజన



మొగుళ్లపల్లి: పర్లపల్లిలో..

టేకుమట్ల: తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం అని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరోజన అన్నారు. శనివారం మండలంలోని రామకిష్టాపూర్(టీ)1 , 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, వనిత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గునిగంటి మహేందర్ అధ్యక్షతన తల్లిపాల విశిష్టతపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సరోజన మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టిస్తే పిల్లలకు రోగ నిరోధక శక్తి వృద్ధి అవుతుందన్నారు. అనంతరం కిశోర బాలికలకు కిశోర అమృతాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, ఆయాలు, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

మొగుళ్లపల్లి: మండలంలోని పర్లపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్లలో శనివారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత, జెడ్పీటీసీ జోరుక సదయ్య మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు ఖచ్చితంగా మురుపాలు పట్టించాలి అది బిడ్డకి మొదటి టీకా వంటిదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జోరుక ప్రేమలత, సబ్ సెంటర్ డాక్టర్ విద్యాసాగర్ , పంచాయతీ కార్యదర్శి నాగార్జున, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, సరోజన, ప్రమీల, స్వరూప, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

కాళేశ్వరం: బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించాలని అంగన్‌వాడీ టీచర్ ఉమామహేశ్వరి అన్నారు. శనివారం పలుగుల గ్రామంలో 2వ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పిల్లలతో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముర్రు పాలతో రోగనిరోధకశక్తి పెరుగుతుందన్నారు. హెల్పర్ రాజక్క, హెచ్ఎం సుశీల, ఉపాధ్యాయులు పూర్ణచందర్, అనిల్ ఉన్నారు.



కాటారం: కిశోరామృతం అందజేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ

కాటారం: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ తెలిపారు. కాటారం మండలం సుందరాజ్‌పేట, కొత్తపల్లి, నాయకపుగూడెం అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై బాలింతలు, గర్భిణులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శ్రీలత, సులోచన, రేణుక, గట్టమ్మ, ఉపసర్పంచ్ రవి, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

చిట్యాల: గర్భిణులు ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలని సీడీపీఓ అవంతి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఒకటవ సెంటర్‌లో తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూర్ణచందర్‌రావు, ఎంపీటీసీ దబ్బెట అనిల్, సూపర్‌వైజర్ జయప్రద, టీచర్లు సంధ్యారాణి, భాగ్యలక్ష్మీ, భాగ్యమ్మ, అరుణ, జ్యోతి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.



కాళేశ్వరంలో..

నవాబుపేటలో..

మండలంలోని నవాబుపేటలో రెండవ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కసిరెడ్డి సాయిసుధ రత్నాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుచరితరెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



అవగాహన సదస్సులో రైతులు

కాళేశ్వరం: ఆయిల్‌పామ్ పంట సాగు చేసి రైతులు అధిక లాభాలు పొందాలని ఎంపీటీసీ రేవెల్లి మమతనాగరాజులు అన్నారు. శనివారం మెట్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధి బీరసాగర్ గ్రామంలో ఉద్యానవన, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ పంట సాగు గురించి గిరిజన రైతులకు వివరించారు. గిరివికాస్ ద్వారా బోర్లు వేసి ఉచిత విద్యుత్ అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులందరూసద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి సర్పంచ్ శోభ, ఏఈఓ సంధ్యారాణి, ఆయిల్‌పాం కంపెనీ ప్రతినిధి రాజేందర్ రెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి



మాట్లాడుతున్న విజయ్

భూపాలపల్లి రూరల్: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని మహాజన సోషలిస్ట్ (ఎంఎస్‌పీ) పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ కందికట్ల విజయ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బట్టు విజయ్ కుమార్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విజయ్ మాట్లాడారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టకుంటే మాదిగ, మాదిగ ఉపకులాల ఆగ్రహానికి బీజేపీ ప్రభుత్వం గురవుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ గట్ల రాజన్న, నాయకులు నోముల శ్రీనివాస్, గాజుల భిక్షపతి మాదిగ, సురేష్, దోర్నాల రాజేందర్, మంద తిరుపతి, భరత్, పవన్ మంద కిరణ్ మాదిగ పాల్గొన్నారు.

సభకు తరలిరావాలి



మాట్లాడుతున్న సమ్మయ్య

మల్హర్: భూపాలపల్లిలోని భారత్ ఫంక్షన్‌హాల్‌లో రేపు (సోమవారం) బీసీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు బీసీలు అధిక సంఖ్యలో తరలిరావాలని జాతీయ బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి విజయగిరి సమ్మయ్య పిలుపునిచ్చారు. మండలంలోని మల్లారం గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన బీసీ సంఘం సమావేశంలో సమ్మయ్య మాట్లాడారు. సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రం సత్యనారయణ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. బహిరంగ సభకు బీసీ ప్రజాప్రతినిధులు, బీసీ కుల సంఘం నాయకులు, సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజయగిరి రాజు, గంగాధిరి గౌడ్, సమ్మయ్యగౌడ్, శ్రీనివాస్, మధు తదితర నాయకులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న విజయ్ కుమార్

చిట్యాల: మండలంలోని ముచినిపర్తి గ్రామ శివారు వెంకటేశ్వర్లపల్లి గ్రామస్తులకు రాష్ట్ర, జిల్లా పెరిక కుల సంక్షేమ సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను శనివారం పంపిణీ చేశారు. నెల రోజులకు సరిపడే విధంగా బియ్యం, నిత్యావసర సరుకులు, దుప్పట్లు, విద్యార్థులకు నోట్‌బుక్స్, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెరిక కుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గటిక విజయ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామంలో ఉన్న పెరిక కులస్తులకు ఐదు లక్షల రూపాయాలు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పెరిక సంఘం ప్రధాన కార్యదర్శి లక్ష్మీ శేఖర్, జిల్లా అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి నారాయణ, నాయకులు దయానంద్, ఉషన్న, ఆనంద్, శంకర్, శ్రీనివాస్, సదయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను పట్టించుకోని ప్రభుత్వం



మొగుళ్లపల్లి: సమ్మెలో పాల్గొన్న కార్మికులు

చిట్యాల: గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో జీపీ సిబ్బంది చేస్తున్న సమ్మెలో పాల్గొని వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..31 రోజులుగా సిబ్బంది సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో జీపీ సిబ్బంది మండల అధ్యక్షుడు మ్యాదరి రాజేందర్, ప్రధాన కార్యదర్శి జిల్లెల కుమార్, సిబ్బంది మొగిలి, సతీష్, యుగేందర్, సదయ్య, శంకర్, రత్నాకర్, కరుణాకర్ సమ్మక్క, రతన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ సిబ్బంది చేస్తున్న సమ్మె శనివారం 31వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు బైరగోని కుమారస్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి పంచాయతీలలో పనిచేస్తున్న సిబ్బందిని పర్మనెంట్ చేయాలని సిబ్బంది వేతనాల కోసం ప్రత్యేక గ్రాంటు కేటాయించాలన్నారు. అబ్బు, మ్యాదరి రమేష్, జగన్నాథం, శ్రీ రాం కృష్ణయ్య, వెంకటేష్, సుధాకర్, కొమురయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్ నిర్మాణానికి కృషి



వినతిపత్రం అందిస్తున్న బుర్గుపేట గ్రామస్తులు

వెంకటాపురం(ఎం): ఇటీవల కురిసిన భారీవర్షాలతో గండ్లు పడిన మారెడుగొండ చెరువును ట్యాంక్ బండ్‌గా మార్చేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్ అన్నారు. మండలంలోని బుర్గుపేట గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించి వరద బాధితులను పరామర్శించారు. గ్రామంలోని 100కు పైగా కుటుంబాలు వరద ముంపుకు గురయ్యాయని, ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వరదల్లో కొట్టుకపోగా ఒకరి మృతదేహం లభించిందని, మిగిలిన ఇద్దరి అచూకీ ఇప్పటి వరకూ లభించలేదని గ్రామస్తులు ఆయన ఎదుట వాపోయారు. మారెడుగొండ చెరువుకు పడిన గండ్లను వెంటనే పూడ్చివేయాలని, ముంపునకు గురైన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకునేవిధంగా చర్య తీసుకోవాలని వినతిపత్రం అందించారు. స్పందించిన సీతారాంనాయక్ వరద బాధితుల సమస్య ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గట్టు కుమారస్వామి, మండల శ్రీధర్‌రెడ్డి, ఓదేలు, ఆ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఈనెల 9న ఘనంగా నిర్వహించుకోవాలని ఆదివాసీ టీచర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మైపతి సంతోష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీ తెగల సంస్కృతి, సంప్రదాయాలను, హక్కులను, చరిత్రని కాపాడుకోవాలని ఐక్యరాజ్య సమితి 1994లో ప్రత్యేక చట్టాన్ని ప్రవేశపెట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేడుకలను అధికారికంగా నిర్వహించి సెలవు ప్రకటించాలని కోరారు.

ప్రొఫెసర్ జయశంకర్ జీవితం ఆదర్శం



టేకుమట్ల: జయశంకర్ సార్ జయంతి వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు



మల్హర్: జయశంకర్ సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

టేకుమట్ల(రేగొండ): ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్‌ను జీవితం ఆదర్శం అని రేగొండ మండలంలోని రామన్నగూడెతండా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కామిడి సతీష్‌రెడ్డి అన్నారు. శనివారం పాఠశాలలో జయశంకర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి పూల మాలలు వేసి, స్వీట్లు పంచారు. అనంతరం సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంతంలో నీళ్లు, నిధులు, నియామకాల్లో అన్యాయం జరుగుతుందనే కారణంతో ప్రత్యేక తెలంగాణను ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారని అన్నారు. ప్రతీ విద్యార్థి ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ సరస్వతి, ఆయాలు అస్లీ, లక్ష్మి పాల్గొన్నారు.

మల్హర్: మండలంలోని తాడిచర్ల జూనియర్ కళాశాలలో ముందస్తుగా ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలను ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అధ్యాపకులు శనివారం ఘనంగా నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ సార్ పాత్ర మరువలేనిదని, ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రవీణ్, ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి రవీందర్, అధ్యాపకులు నరేందర్, వెంకట్ రెడ్డి, కరుణాకర్, స్వరూప, నరేష్, రమేష్, భరత్ రెడ్డి, రవి, సిబ్బంది రాములు, షబ్బీర్ పాల్గొన్నారు.

పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

ఏటూరునాగారం: ఇటీవల కరిసిన భారీ వర్షాలతో ముంపునకు గురైన బాధితులకు ప్రభుత్వం భూమి, పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గిరిజన భవన్, పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాల్లోని వరద బాధితులతో శనివారం ఆయన మాట్లాడారు. కొండాయి, ఎలిశెట్టిపల్లి, మల్యాల గ్రామాలు ముంపు గురి కావడంతో ప్రజలు ఇబ్బందుల్లో పడ్డారని అన్నారు. ముంపు బాధితులకు అధికారులు, పోలీస్ యంత్రాంగం చేసిన సేవలు మరువలేనివన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముంపు గ్రామాలకు శాశ్వత పరిష్కారం చూపించాలని, ఎత్తులో ప్రాంతంలో భూమి కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోడెం బాబు, నాయకులు ఆలం కిషోర్, బాలకృష్ణ ఉన్నారు.

ఆదివాసీ చట్టాలను అమలు చేయాలి

ఆదివాసీ చట్టాలను పక్కాగా అమలు చేయలని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఆవరణంలో శనివారం ఆయన మాట్లాడారు. లంబాడీలను ఎస్టీ జాబితాలో నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ హక్కులను సాధించుకునేందుకు ఉద్యమిస్తున్న ఎంపీ సోయం బాబురావుపై కొందరు డీజీపీకి ఫిర్యాదు చేయడం వికృత చేష్టలకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొడెం బాబు, ఆలం కిషోర్, పులిశ బాలకృష్ణ, ఎట్టి ప్రకాష్, కొర్నిబెల్లి గణేష్ ఉన్నారు.

ఓడవాడలో వైద్యశిబిరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, 9 వార్డులోని ప్రాథమిక పాఠశాలలో శనివారం స్థానిక వెల్నెస్ సెంటర్ వైద్యురాలు ఛాముండేశ్వరి వైద్య శిబిరం నిర్వహించారు. కళ్లకలకతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి మందులు పంపిణీ చేశారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పించామన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు



సంబురాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సూరత్ కోర్టు విధించిన రెండు సంవత్సరాల శిక్షపై సుప్రీం కోర్టు స్టే ఇవ్వడంతో కాంగ్రెస్ నాయకులు శనివారం జిల్లా కేంద్రంలో సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఇంటి పేరుపై రాహుల్ గాంధీ వ్యాఖ్యల కేసులో గుజరాత్‌లోని సూరత్ కోర్టు రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించిందన్నారు. దీంతో ఆ శిక్షను నిలుపుదల చేస్తూ సర్వోన్నత న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. టీపీసీసీ సభ్యుడు మధు, పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్, కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, నాయకులు కొమురయ్య, అంబాల శ్రీనివాస్, మధుకర్ రెడ్డి పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి చెల్లించాలి

ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని నెరవేర్చాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారికి ప్రతీ నెల రూ. 3016 నిరుద్యోగభృతి అందిస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ ఇప్పటికి అమలు చేయలేదన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి నిరుద్యోగభృతి అమలు చేయాలన్నారు. మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండగా బీఆర్ఎస్ సర్కార్ మాయమాటలు చెప్పుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ సిరికొండ బలరాం, జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య జవహర్‌నాయక్, కార్యదర్శి రవీంద్రాచారి, రవిరెడ్డి, కృష్ణాకర్, ఇమ్మడి రాకేష్, కారుపోతుల యాదగిరి, గాదం కుమార్, సంపత్, రాకేష్‌రెడ్డి, కిషోర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి : 9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291
కె. సుధాకర్ (ACO) : 9177258410